సాక్షి తిరుపతి

మంగళవారం । 28 । నవంబర్ । 2023



కార్తీకం..కమనీయం

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని తిరుపతి నగరంలోని కపిలతీర్థంలో దీపాలు వెలిగిస్తున్న మహిళా భక్తులు - సాక్షి, తిరుపతి



పున్నమి కాంతులు

కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని మంగళంలోని ఈశానేశ్వర నవలింగ క్షేత్రంలో శివయ్య చెంత చందమామ కనువిందు. - సాక్షి, తిరుపతి



భక్తులతో పోటెత్తిన శివయ్య క్షేత్రం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. - 8లో

న్యూస్‌రీల్

2న మెగా జాబ్‌మేళా

తిరుపతి సిటీ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అన్నమయ్య జిల్లా, రాయచోటి సాయి ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో డిసెంబర్ 2న రీజనల్ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎస్.శ్యామ్‌మోహన్ తెలిపారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 120 బహుళ జాతీయ కంపెనీలు పాల్గొంటాయని, రాయలసీమ పరిధిలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ, నర్సింగ్, బీటెక్, పీజీ విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన యువతీయువకులు ఈ జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలకు హాజరుకానున్న అభ్యర్థులు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ వెంట తీసుకురావలని సూచించారు. మరిన్ని వివరాలకు 7799587687, 8897776368, 9177143181 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 13 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 70,350 మంది స్వామివారిని దర్శించుకోగా, 19,500 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.11 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపండి



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో పెంచల కిషోర్

తిరుపతి అర్బన్: ప్రతి అర్జీకి అధికారులు పరిష్కారం చూపాలని డీఆర్వో పెంచల్ కిషోర్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలు మూలల నుంచి మొత్తం 83 వినతులు వచ్చినట్టు తెలిపారు. ఇందులో అత్యధికంగా 69 అర్జీలు రెవెన్యూశాఖకు సంబంధించినవే ఉన్నాయన్నారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. డెప్యూటీ కలెక్టర్ భవానీ, ఏవో జయరాములు, జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కులగణనపై అవగాహన సదస్సు

తిరుపతి అర్బన్: కులగణన ప్రాంతీయ అవగాహన సదస్సు మంగళవారం శ్రీపద్మావతి మహిళా వర్సిటీలోని ప్రియదర్శిని ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తోపాటు ఇతర ప్రజాప్రతినిధులు, కులసంఘం నేతలు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, మేధావులు హాజరుకానున్నట్టు ఆయన వెల్లడించారు.

యూటీఎఫ్ తిరుపతి జిల్లా ఎన్నికలు ఏకగ్రీవం



జీజే.రాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు



కే.ముత్యాలరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి

తిరుపతి ఎడ్యుకేషన్: ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య (యూటీఎఫ్) తిరుపతి జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం పుత్తూరులో ఏకగ్రీవంగా జరిగింది. ఈ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షునిగా జీజే.రాజశేఖర్(డీవీ.సత్రం), ప్రధాన కార్యదర్శిగా కే.ముత్యాల రెడ్డి (రేణిగుంట), గౌరవాధ్యక్షులుగా కే.శేఖర్ (సూళ్లూరుపేట), సహాధ్యక్షులుగా కేఎస్‌బీ.సూర్యప్రకాష్ (కేవీబీ.పురం) కందల శ్రీదేవి (నారాయణవనం), కోశాధికారిగా పీ.రమేష్‌నాయుడు(పాకాల) ఎన్నికయ్యారు. వీరితో పాటు 14 మంది జిల్లా కార్యదర్శులుగా, ఏడుగురు రాష్ట్ర కౌన్సిలర్లుగా, మరో ఏడుగురు ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా, వీరితో పాటు జిల్లా మహిళా కమిటీ కన్వీనర్, సోషల్ మీడియా కన్వీనర్, యూటీఎఫ్ ఉపాధ్యాయ కన్వీనర్, ఓపీఎస్ సాధన కమిటీ కన్వీనర్, అకడమిక్ సెల్ కన్వీనర్, కల్చరల్ కన్వీనర్, ఎంటీఎస్ టీచర్ల కన్వీనర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతనంగా ఎన్నికైన యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

చిన్నారుల ఆరోగ్యానికి.. కొండంత భరోసా

శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నమూనా





పిల్లలు దైవస్వరూపులు. వారికి కష్టం వచ్చినా చెప్పుకోలేరు. అనారోగ్య సమస్యలొచ్చినా తీర్చుకోలేరు. అనేక మంది పేదలు తమ పిల్లలకు సరైన వైద్యసదుపాయాలు అందించలేక తల్లడిల్లిపోతుంటారు. రాష్ట్ర విభజన తర్వాత మన ఆంధ్రప్రదేశ్‌కు చిన్న పిల్లల కోసం ప్రత్యేక సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి లేకుండా పోయింది. గత పాలకులు ఈ విషయాన్ని పూర్తిగా విస్మరించారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారుల ఆరోగ్య భద్రతకు నడుం బిగించారు. ఇప్పటికే శ్రీపద్మావతి హృదయాలయాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్మించి పేద గుండెకు భరోసానిస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీవారి పాదాల చెంత తిరుపతిలో శ్రీపద్మావతి చిన్నపిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రూపకల్పనకు సంకల్పించారు. ఈ బాధ్యతను ఆయన ఏడాది క్రితం టీటీడీకి అప్పగించారు. ప్రస్తుతం ఆస్పత్రి భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. 2024 మార్చి నాటికి ప్రారంభించాలని పరితపిస్తున్నారు. చిన్న పిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి, వైద్య సదుపాయాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం

- అంతర్జాతీయ ప్రమాణాలతో చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి
- అలిపిరి వద్ద శరవేగంగా భవన నిర్మాణం
- 350 పడకలు.. 15 విభాగాలు
- టీటీడీ ఆధ్వర్యంలో రూ.210 కోట్లతో ఏడు అంతస్తుల భవంతి
- అవయవాల మార్పిడి అందించే దిశగా చర్యలు
- ఎయిర్ అంబులెన్స్ కోసం భవనంపైనే ప్రత్యేక హెలిప్యాడ్
- సిబ్బంది నియామకానికి టీటీడీ చర్యలు

తిరుపతి తుడా: శ్రీవారి పాదాల చెంత అలిపిరి సమీపంలో ఆరు ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక హంగులతో చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి రూపుదిద్దుకుంటోంది. ఈ భవన నిర్మాణానికి టీటీడీ రూ.210 కోట్ల వరకు ఖర్చు చేస్తోంది. ఏడు అంతస్తులు.. భవనం ఉపరితలంపై ఎయిర్ అంబుల్స్ కోసం హెలిప్యాడ్‌ను సైతం ఏర్పాటు చేయనున్నారు. సుమారు 350 పడకల సామర్థ్యంతో భవన నిర్మాణ పనులు సాగుతున్నాయి. ఆస్పత్రి నిర్వహణ కోసం అవసరమైన నియామకాలకు టీటీడీ నడుంబిగించింది. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 15 విభాగాలతో వైద్య సేవలందించేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో హెమటో ఆంకాలజీ, మెడికల్ ఆంకాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీ వంటి ప్రత్యేక విభాగాల్లో చిన్నారులకు వైద్య సేవలు, చికిత్సలు అందించనున్నారు. దీంతో పాటు అత్యంత ఖరీదైన బోన్ మారో ట్రాన్స్‌ప్లాంటేషన్, హార్ట్ ట్రాన్స్‌ప్లాంటేషన్, ఇతర అవయవాల మార్పిడి శస్త్రచికిత్సలను కూడా అందించే దిశగా అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఈ స్థాయిలో వైద్య సేవలందించే ఆస్పత్రి దేశంలోనే ప్రప్రథమంగా గుర్తింపు పొందనుంది.

అత్యాధునిక వైద్య పరిజ్ఞానం

టీటీడీ పరిధిలోని స్విమ్స్, బర్డ్, చిల్డ్రన్స్ కార్డియాక్ కేర్ ఆస్పత్రుల్లో ఆధునిక వైద్య సేవలందిస్తున్నారు. రాయలసీమ ప్రాంతాల్లో ఎక్కడా లేని ఆధునిక వైద్య పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇప్పుడు చిన్న పిల్లల సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో వైద్య చికిత్సకు అవసరమైన అధునిక ల్యాబ్, సిటీ, ఎంఆర్ఐ, ఎక్స్‌రేతో పాటు ఐసీయూ యూనిట్లు, ఆపరేషన్ థియేటర్లు, అవయవాల మార్పిడి, బోన్ మారో వంటి అరుదైన శస్త్ర చికిత్సల కోసం అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన వైద్య సామగ్రిని సమకూరుస్తున్నారు. అత్యాధునిక వైద్య సామగ్రి కోసం టీటీడీ రూ.60 కోట్ల వరకు ఖర్చు చేయనుంది.



నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం

అవయవ మార్పిడికి కేంద్ర బిందువు

ఇప్పటికే టీటీడీ ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె చికిత్సాలయం పేద పిల్లలకు వరంగా మారింది. గుండె సంబంధిత శస్త్ర చికిత్సలను డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, టీటీడీ ప్రాణదాన పథకం కింద ఉచితంగా చికిత్సలు చేస్తున్నారు. ఆస్పత్రి ప్రాంభించిన రెండేళ్లలోనే సుమారు 2వేలకు పైగా గుండె సంబంధిత శస్త్ర చికిత్సలను అందించారు. మరో ఎనిమిది మందికి గుండె మార్పిడి శస్త్రచికిత్సలు విజవంతంగా పూర్తిచేశారు. అనతి కాలంలోనే అత్యుత్తమ కార్డియాక్ ఆస్పత్రిగా రికార్డుల్లోకెక్కింది. ఈ ఆస్పత్రి సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేశారు. చిన్న పిల్లలకంటూ ప్రత్యేక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అవసరమని భావించారు. ఆ ఆలోచనను టీటీడీ ద్వారా కార్యరూపం దాల్చారు. ఈ ఆస్పత్రి నిర్మాణ బాధ్యతలను సీఎం టీటీడీకి అప్పగించారు. అతి త్వరలో ఈ ఆస్పత్రిని ప్రారంభించే దిశగా పనులు వేగవంతం చేశారు.

పేద పిల్లలకు భరోసా



"టీటీడీ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీపద్మావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పేదల పిల్లల ఆరోగ్యానికి కొండంత భరోసా ఇవ్వనుంది. ఇప్పటికే గుండె చికిత్సాలయం అత్యున్నత స్థాయి వైద్యాన్ని అందిస్తోంది. చిన్నపిల్లల ఆస్పత్రిలో 15 విభాగాల్లో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. అంతర్జాతీయ స్థాయి వైద్య ప్రమాణాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం. ఈ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే దేశం మొత్తం తిరుపతి వైపు చూస్తుంది.

–డాక్టర్ శ్రీనాథరెడ్డి, డైరెక్టర్,శ్రీపద్మావతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, తిరుపతి

దేశంలో ఎక్కడా లేనివిధంగా..



"దేశంలో ఎక్కడాలేని విధంగా చిన్న పిల్లల కోసం అత్యాధునిక సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని తిరుపతిలో నిర్మిస్తున్నాం. సీఎం వైఎస్ జగన్ తన మానస పుత్రికగా ఈ ఆస్పత్రి పురుడుపోసుకుంటోంది. ఆస్పత్రి నిర్మాణంలో ఎక్కడా రాజీపడడం లేదు. అంతర్జాతీయ వైద్య పరిజ్ఞానాన్ని తీసుకొస్తాం. చిన్న పిల్లల కోసం ఏ ముఖ్యమంత్రి చేయని ఆలోచన జగనన్న చేశారు. 2024 మార్చి కల్లా ఈ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తా

– భూమన కరుణాకరరెడ్డి, చైర్మన్, టీటీడీ , తిరుపతి ఎమ్మెల్యే



తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం భారత ప్రధాని నరేంద్రమోదీ దర్శించుకున్నారు. ఆయన మహాద్వారం వద్దకు చేరుకోగా ఆలయ మర్యాదలతో అర్చకులు, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ. ధర్మారెడ్డి, వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. తదనంతరం రంగనాయక మండపంలో టీటీడీ క్యాలెండర్, డైరీ 2024 పంచగవ్యాలను టీటీడీ చైర్మన్, ఈఓ. అందజేశారు. – సాక్షి, తిరుపతి

ఇదీ ఆనవాయితీ!

తిరుమల: 'శ్రీవారి ఆలయంలో రంగనాయకుల మండపంలోని శేష వాహనం ముందు వీవీఐపీలకు శ్రీవారి ప్రసాదాలు, చిత్రపటం ఇవ్వడం, వారిని అడిగి ఫొటోలు తీసుకోవడం పరిపాటి. అనంతరం వీటిని మీడియాకు, వీవీఐపీలకు కూడా పంపుతుంటారు. దీన్ని కూడా కొందరు రాజకీయం చేసి విమర్శలకు దిగడం దౌర్భాగ్యం' అని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంప్రదాయంలో భాగంగానే సోమవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం రంగనాయకుల మండపంలో భారత ప్రధాని నరేంద్రమోదీకి వేదపండితులు ఆశీర్వచనం పలికారని తెలిపారు. తానే పీఎంను ఆహ్వానించి, అక్కడ వారికి స్వామివారి ప్రసాదాలతో పాటు టీటీడీ కాఫీ టేబుల్ బుక్, పంచగవ్య ఉత్పత్తులు, 2024 డైరీ, క్యాలెండర్, స్వామివారి చిత్రపటం అందజేసినట్లు పేర్కొన్నారు. వేదపండితుల ఆశీర్వచనం తర్వాత తానే ప్రధానమంత్రిని ఆహ్వానించి ఫొటోలు తీయించినట్టు వెల్లడించారు. అయితే కొంతమంది స్వామివారి శేష వాహనం ముందు ఇలా చేయడం సరికాదంటూ ప్రచారం చేయడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి దుర్మార్గపు ప్రచారాన్ని భక్తులు నమ్మరాదని విజ్ఞప్తి చేశారు.

గరుడ వాహనంపై కనువిందు



చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు సోమవారం రాత్రి గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్తీక మాసం పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారికి ఊంజల్ సేవ కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గోవిందుడు తనకు ప్రీతిపాత్రమైన గరుడునిపై ఆశీనులై నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ చెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, జమేదారు చిరంజీవి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రీమోడలింగ్ భవనాల ప్రారంభం



అటవీశాఖ కార్యాలయంలో రీమోడల్ చేసిన భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

తిరుపతి అర్బన్: అభివృద్ధి దిశగా అటవీశాఖ అడుగులు వేస్తున్నట్లు రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక కపిలతీర్థం సమీపంలోని ఫారెస్ట్ కార్యాలయానికి సంబంధించి రీ-మోడలింగ్ చేసిన భవనాలను ప్రారంభించి ఆయన మాట్లాడారు. ఓ వైపు పెద్ద ఎత్తున సంక్షేమ ఫలాలను ప్రభుత్వం అందిస్తూ.. మరోవైపు మెరుగైన సౌకర్యాలను కల్పించడమే కాకుండా అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ ఫలాలను ఇస్తున్నామన్నారు. పార్టీలు, కులాలు, మతాలు, ప్రాంతాలకతీతంగా అందరికీ న్యాయం చేస్తున్న సర్కార్ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి, సీసీఎఫ్ నాగేశ్వరరావు పలువురు ఫారెస్ట్ అధికారులు పాల్గొన్నారు.

కార్గో డోర్ డెలివరీ సేవలు వినియోగించుకోండి



కార్గో సెంటర్‌లో డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డీపీటీఓ చెంగల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన సేవలను అందించాలని కోరారు. ప్రైవేటు వారితో పోల్చుకుంటే ఎంతో తక్కువ ధరలకే డోర్ డెలివరీ చేస్తున్నట్లు చెప్పారు. జిల్లా కార్గో ఇన్‌చార్జి సురేంద్రబాబు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

తిరుపతి సిటీ: తిరుపతి ఎన్‌సీసీ 2ఏ ఆర్‌అండ్‌వీ రెజిమెంట్ ఆధ్వర్యంలో ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆవరణలో సోమవారం జరిగిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. ఇందులో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి 30 మంది, వెటర్నరీ సైన్స్ కళాశాలకు చెందిన 30 మందికి పైగా ఎన్‌సీసీ విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. స్థానిక మెటర్నిటీ హాస్పిటల్ డాక్టర్ ఠాగూర్, ఆసుపత్రి సిబ్బంది రక్తదాన శిబిరంలో పాల్గొన్నారు. వెటర్నరీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవి, ప్రిన్సిపల్ జగపతి రామయ్య, ఎన్‌సీసీ అధికారులు కల్నల్ ఎస్.ప్రకాశ్ కుమార్, పురుషోత్తమ నాయుడు, సుధీర్ కుమార్, ఎస్ పాల్, టీకే గౌర్లై, సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

చిరకాల స్వప్నం సాకారం

- 22ఏ కింద ఉన్న కుటుంబాలకు మోక్షం
- ఇళ్లు, స్థలాల రిజిస్ట్రేషన్లకు శ్రీకారం
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

తిరుపతి అర్బన్ : ఇంటి స్థలానికి హక్కు పొందడం తిరుపతి వాసుల చిరకాల స్వప్నం. 22ఏ కింద తిరుపతిలోని 5,600 కుటుంబాలకు చెందిన ఇంటి స్థలాలు, ఇళ్ల సమస్య నాలుగు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉంది. ఇటీవల స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, నగర డెప్యూటీ మేయర్ ఆ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. తర్వాత కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీతో పలుమార్లు చర్చించి పరిష్కారమార్గాన్ని కనుగొన్నారు. ఈ క్రమంలో భూహక్కు పత్రాలు పొందిన వారు ఒక్కొక్కరూ తమ ఇంటి స్థలాలు, ఇళ్లకు సంబంధించి రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రక్రియను ప్రారంభించారు. రిజిస్ట్రార్ ఆనందన్‌తోపాటు జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ వారికి సహకారం అందిస్తున్నారు.

రిజిస్ట్రేషన్లకు శ్రీకారం

సోమవారం తిరుపతి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తాతయ్యగుంట ప్రాంతానికి చెందిన కే.బాలసుబ్రమణ్యం, వీ.లక్ష్మి, సీ.మునిరాజ తమ ఇళ్లు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ క్రమంలో డెప్యూటీ మేయర్ భూమన అభినయర్ రెడ్డితోపాటు స్థానిక కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళ్లికారెడ్డి రిజిస్ట్రేషన్‌కు సాక్షి సంతకాలు చేశారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కరించడమే కాకుండా దగ్గరుండి రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడంపై లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.




రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి, కార్పొరేటర్ దొడ్డారెడ్డి ప్రవళ్లికారెడ్డి

టీడీపీ నేతలు మోసం చేశారు

డెప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించడం సంతోషంగా ఉందన్నారు. గతంలో టీటీడీ నేతలు భూములకు రిజిస్ట్రేషన్లు చేసి ఇస్తామని మోసం చేశారని గుర్తుచేశారు. తాము మంచి చేస్తున్నా విమర్శలు చేస్తున్నారని ఆవేదన చెందారు. నగర అభివృద్ధిలో భాగంగా మాస్టర్‌ప్లాన్ రోడ్లు ఏర్పాటు చేసినా తప్పుపట్టడం మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. పార్టీ నేతలు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి, ధనశేఖర్, అరుణ్ యాదవ్, వాసు యాదవ్, ఇంద్రాన్ బాషా, చాంద్ బాషా, సాలూరు ప్రసాద్ పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేయించుకోండి



"22ఏ కింద ఇంటి స్థలాలు, ఇండ్లు ఉన్నవారు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆ మేరకు రిజిస్ట్రార్ ఆనందన్‌కు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. ఇప్పటికే 20 మందికిపైగా రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు.

-శ్రీరామకుమార్, జిల్లా రిజిస్ట్రార్

ఎంబీయూలో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీపై అవగాహన


విద్యార్థులతో వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ

చంద్రగిరి: మండల పరిధిలోని మోహన్‌బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో సోమవారం వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రఫీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ ఇనేష్ సిద్ధార్థ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ వృత్తిలో కష్టాలను అధిగమించి విజయాన్ని అందుకోవాలన్నారు. ప్రతి చోటా ఒతిళ్లు సహజమన్నారు. తాను శేషాచల అడవుల్లో ఎన్నో కొత్త రకాల జీవరాశులను ఫొటోల రూపంలో ప్రపంచానికి పరిచయం చేసినట్లు చెప్పుకొచ్చారు. గతేడాది తాను తీసిన ఫొటోలకు అంతర్జాతీయ బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును సైతం అందుకున్నట్టు వెల్లడించారు. తాను కూడా ఎంబీయూలో డిగ్రీ పూర్తి చేసినట్లు వివరించారు. అనంతరం ఫొటోగ్రఫీలో పాటించాల్సిన మెలకువలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు.

ఉరివేసుకుని వివాహిత మృతి


కుటుంబ సభ్యులను విచారిస్తున్న గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ

వెంకటగిరి రూరల్: భార్యాభర్తల మధ్య కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వివాహిత ఉరివేసుకుని తనువు చాలించిన ఘటన పట్టణంలోని బొగ్గులమిట్టలో సోమవారం వెలుగులోకి వచ్చింది. సీఐ సంగమేశ్వరరావు కథనం.. వెంకటగిరి పట్టణంలోని బొగ్గులమిట్టకు చెందిన రాయని వీరభద్రయ్య, శాంతి(35) దంపతులు చేనేత పనులు చేస్తూ జీవనం సాగించేవారు. ఇటీవల భార్యాభర్తలిద్దరూ గొడవ పడడంతో భార్య శాంతి బొప్పాపురంలోని పుట్టింటికి వెళ్లింది. ఆదివారం బొప్పాపురానికి వచ్చిన భర్త వీరభద్రయ్య భార్యను తీసుకుని బొగ్గులమిట్టలోని తన ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో శాంతి తల్లి విజయమ్మ సోమవారం బొగ్గులమిట్టకు వచ్చి చూడగా కుమార్తె ఉరివేసుకుని ఉండడం చూసి దిగ్భ్రాంతి చెందింది. సమాచారం అందుకున్న గూడూరు డీఎస్పీ సూర్యనారాయణ, సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐ నరసింహారావు ఘటనా స్థలానికి చేరుకుని మృతురాలిని పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శాంతి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల చూపు..ప్రభుత్వ బడుల వైపు



రామాపురం ఎంపీపీ స్కూల్(నాడు),పిచ్చాటూరు మండలం



రామాపురం ఎంపీపీ స్కూల్(నేడు),పిచ్చాటూరు మండలం

జనవాక్కు

సాధారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుతోపాటు సౌకర్యాలు ఉన్న పాఠశాలలో చేర్పించడానికి ఆసక్తి చూపిస్తారు. ఫీజులు అటూఇటూ ఉన్నా పిల్లల చదువుకోసం ఎంతకైనా తెగిస్తారు. దీన్ని దృష్టిలో ఉంచుకునే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చిన తర్వాత ప్రభుత్వ బడుల రూపురేఖలను సమూలంగా మార్చేశారు. కార్పొరేట్ పాఠశాలలను తలదన్నేలా నాడు–నేడుతో తీర్చిదిద్దారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు ప్రయివేటు పాఠశాలలను వీడి ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపిస్తున్నారు. ఇటు సౌకర్యాలు, ఇంగ్లిష్ చదువుతోపాటు పిల్లలకు అవసరమైన పుస్తకాలు, బ్యాగ్, షూ తదితర వాటిని ఉచితంగా అందిస్తుండడంతో తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి ఉపశమనం పొందుతున్నారు. పైసా ఖర్చులేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్న సీఎం జగనన్నకు కృతజ్ఞతలని ముక్తకంఠంతో నినదిస్తున్నారు. – తిరుపతి అర్బన్

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ బడులు



నాకు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద అమ్మాయి పేరు అక్షయ సూళ్లూరుపేట పట్టణ సమీపంలోని మన్నారుపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతోంది. రెండో అమ్మాయి శ్రావ్య 6 తరగతి చదువుతోంది. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అంటేనే భయమేసేది. పిల్లలను పాఠశాలలకు పంపడం కష్టంగా ఉండేది. అయితే జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మనబడి నాడు–నేడులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించారు. ప్రధానంగా తాగునీటి వసతి, మరుగుదొడ్లు, పిల్లలు కూర్చునేందుకు డెస్క్‌లు, గదుల్లో ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పాఠశాలల్లో డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేశారు.

–విద్యార్థినితోపాటు తల్లి సురేఖ, మన్నారుపోలూరు, సూళ్లూరుపేట మండలం

ఆహ్లాదకరంగా పాఠశాలలు



ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించారు. గతంలో పాఠశాలలు పెచ్చులూడి ఎక్కడ బిడ్డలపై పడతాయో అనే భయం ఉండేది. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో విడతల వారీగా నాడు–నేడు పేరుతో పాఠశాలల రూపురేఖలను మార్చేశారు. బల్లవోలులోని పాఠశాల ఎంతో అందంగా..ఆహ్లాదకరంగా ఉంది. దీనికితోడు బిడ్డలకు ఇంగ్లిషు మీడియం కూడా చెబుతున్నారు. సీబీఎస్ఈ సిలబస్ తీసుకొస్తున్నారు. అమ్మఒడి వస్తోంది. పైసా ఖర్చులేకుండా కార్పొరేట్ స్థాయిలో చదివించినట్టుంది.

–చెరుకూరు ప్రవళిక, బల్లవోలు గ్రామం, చిల్లకూరు మండలం

రుణపడి ఉంటాం



రాష్ట్ర ప్రభుత్వం మనబడి నాడు–నేడు పేరుతో పాఠశాలలను అభివృద్ధి చేయడం ఓ వరంగా భావిస్తున్నాం. ఈ స్థాయిలో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసే ముఖ్యమంత్రి వస్తారని ఊహించలేదు. పైసా ఖర్చు లేకుండా మెరుగైన సౌకర్యాలు, పౌష్టికాహారం అందిస్తుండడంతో ప్రభుత్వ పాఠశాలలు హౌస్‌ఫుల్ అవుతున్నాయి. ఆధునిక టెక్నాలజీతో ఫర్నిచర్, ట్యాబ్‌లు, డిజిటల్ తరగతులను ఏర్పాటు చేసి పేద విద్యార్థుల ఉన్నత చదువులకు కృషిచేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం.

- విద్యార్థితోపాటు తండ్రి టీ.లక్ష్మయ్య, బంగారుపేట, వెంకటగిరి

కల నెరవేరింది



మాది రామచంద్రాపురం మండలం, అనిచెరువు గ్రామం. నేను నిరుపేదరాలుని. నాకు ఇద్దరు పిల్లలున్నారు. మా ఊర్లోని పిల్లలందరూ మంచి దుస్తులు, బూట్లు, బెల్టు వేసుకుని కాన్వెంట్‌కు వెళుతుంటే చూసి నా పిల్లల్ని కాన్వెంట్‌కు పంపించలేకపోతున్నానే అనే బాధతో దిగులు చెందేదాన్ని. అయితే నాడు–నేడుతో మా ఊర్లోని బడిలో తరగతి గదులు, ఫ్యాన్లు, బల్లలు, ఆధునిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. దీంతో మా గ్రామంలోని బడి కార్పొరేట్ పాఠశాల కన్నా మెరుగ్గా తయారైంది. ఇంగ్లిషు మీడియం చదువులు చెబుతున్నారు. నేను నా పిల్లల్ని కాన్వెంట్‌లో చదివించాలన్న కోరిక ప్రభుత్వ బడిలోనే తీరింది. సీఎం సార్‌కు ధన్యవాదాలు.

- రేణుక, విద్యార్థిని తల్లి, అనిచెరువు గ్రామం, రామచంద్రాపురం మండలం

వసతులు మెరుగుపడ్డాయి



నాడు–నేడుతో పాఠశాలల రూపురేఖలు మారాయి. వసతులు మెరుగుపడ్డాయి. ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడుతున్నాయి. పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్వోప్లాంట్ ద్వారా మినరల్ వాటర్ అందిస్తున్నాం. విద్యార్థులకు డిజిటల్ విద్య అందుతోంది. ముఖ ఆధారిత హాజరు వల్ల ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు వస్తున్నారు. విద్యాబోధన మెరుగుపడింది. మధ్యాహ్నం జగనన్న గోరుముద్ద పెడుతున్నారు. ఏటా విద్యార్థులకు జగనన్న విద్యా కానుకతో పాఠ్య పుస్తకాలు, స్కూల్ బ్యాగ్, టై, సాక్స్, యూనిఫాం, భోజన ప్లేట్లు ఉచితంగా సమకూర్చుతున్నారు. ఆ పాఠశాలకు భద్రతగా ప్రహరీగోడ, తరగతి గదుల్లో డస్కులు, నూతనంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు.

-హరిబాబు, ప్రధానోపాధ్యాయులు, అంబికాపురం, వరదయ్యపాళెం మండలం

సాక్షి క్లాసిఫైడ్స్

వెలికల్లులో ఘోర రోడ్డు ప్రమాదం

- ఇద్దరు మృతి
- 15 మందికి గాయాలు
- పలువురు పరిస్థితి విషమం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

డక్కిలి: మండలంలోని వెల్లికల్లు వద్ద సోమవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. నారు వేతలకు వెళ్లి ఆటోలో తిరిగి వస్తుండగా వెంకటగిరి– రాపూరు జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా.. మరో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. స్థానికులు, పోలీసుల కథనం.. మండలంలోని వెలికల్లు, రాపూరు మండలం ఏపూరు గ్రామాలకు చెందిన కూలీలు సోమవారం ఉదయం డక్కిలి మండలం, చెన్నసముద్రం (తురకపల్లి) గ్రామానికి వరి నాట్లు వేసేందుకు వెళ్లారు. పనులు ముగించుకుని స్వగ్రామానికి ఓ ఆటోలో బయలుదేరారు. ఇదే సమయంలో రాపూరు నుంచి డక్కిలి వస్తున్న టాటా మ్యాజిక్ ట్రక్కు వాహనం వేగంగా ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఏపూరు గ్రామానికి చెందిన విశాఖ (45), టాటా మ్యాజిక్ వాహనం డ్రైవర్ గుండాల వెంకటేశ్వర్లు(25) మృతి చెందాడు. అలాగే వెలికల్లుకు చెందిన మచ్చల పెద్దరమణమ్మ, పెంచలమ్మ, సుమతి, రత్నమ్మ, పాముల పోలమ్మ, ఆదిలక్ష్మమ్మ, పద్మమ్మ, ఆటో డ్రైవరు గోపీతో పాటు పలువురు కూలీలు తీవ్రగా గాయపడ్డారు. వీరిని 108లో రాపూరు ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. డక్కిలి ఎస్ఐ నాగరాజు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. కేసు దర్యాప్తులో ఉంది.

గవర్నర్‌కు సాదర వీడ్కోలు


రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్‌కు వీడ్కోలు పలుకుతున్న కలెక్టర్, జేసీ

రేణిగుంట: భారత ప్రధాని నరేంద్రమోదీకి స్వాగతం పలికేందుకు వచ్చిన రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు సోమవారం రేణిగుంట విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. ఆయనకు జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, ఆర్‌డీవోలు, తహసీల్దార్లు, ఎయిర్‌పోర్ట్ అధికారులు వీడ్కోలు పలికారు. ఆయన ఇక్కడ నుంచి విజయవాడకు బయల్దేరి వెళ్లారు.

భక్తులతో పోటెత్తిన శివయ్య క్షేత్రం


కిటకిటలాడుతున్న భక్తులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని రాష్ట్ర నలుమూలల నుంచి మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. స్వర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివయ్యను దర్శించుకున్నారు. అనంతరం కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. సోమవరం పున్నమి ఘడియలు ఉండడంతో కొండ చుట్టు ఉత్సవంలో అధిక సంఖ్యంలో భక్తులు పాల్గొన్నారు. సోమవరం ఒక్క రోజే సుమారు రూ.50 లక్షల వరకు ఆదాయం వచ్చినట్లుగా అధికారులు ప్రకటించారు.

సీనియర్ జర్నలిస్ట్ స్పోర్ట్స్ శ్రీను ఇక లేరు


శ్రీనివాసులు(ఫైల్)

పుంగనూరు: రాష్ట్రస్థాయి క్రీడాకారుడు, సీనియర్ జర్నలిస్ట్, స్పోర్ట్స్ శ్రీనుగా పేరొందిన శ్రీనివాసులు(62) సోమవారం హఠాన్మరణం చెందారు. జర్నలిస్ట్‌గా తిరుపతి జిల్లా కేంద్రంలో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆదివారం తిరుపతిలో ఒక సమావేశంలో సైతం ఆయన పాల్గొన్నారు. సోమవారం ఉదయం పలు పర్యాయాలు ఫోన్ చేసినా ఆయన లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానించిన మిత్రులు ఆయన రూమ్‌కు వెళ్లి చూడగా బెడ్‌పై విగతజీవిగా ఉండటం చూశారు. గుండెపోటుకు గురై నిద్రలోనే మరణించినట్లు గ్రహించారు. సమాచారం తెలుసుకున్న శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్(తిరుపతి) ఏఓ సయ్యద్, పలువురు పాత్రికేయులు ఆయన భౌతిక కాయం వద్ద నివాళులర్పించారు. పుంగనూరు ప్రెస్‌క్లబ్, తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో పలువురు సంతాపం వ్యక్తం చేశారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల వార్తలను రాయడంలో ఆయన సిద్ధహస్తుడు. అలాగే వివిధ క్రీడాపోటీలకు అంపైర్‌గా కూడా ఆయన సేవలు వినియోగించుకున్న సందర్భాలు అనేకం. ఆయన స్వగ్రామమైన పెద్దపంజాణి మండలం చలమంగళంలో సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు ఇద్దరు సోదరులు ఉన్నారు.

కొండ చిలువ కలకలం



డక్కిలి: మండలం, వెంకటగిరి–రాపూరు రహదారిలోని ఎగువమార్లగుంట గ్రామంలో సోమవారం దాదాపు పది అడుగులపైనే ఉన్న కొండ చిలువ కలకలం సృష్టించింది. కండలేరు–పూండి కాలువ నుంచి గ్రామంలోకి చొరబడింది. రామక్రిష్ణ అనే వ్యక్తి ఇంటి బయట రేకుల షెడ్ పైకి ఎక్కి నక్కింది. కోళ్లు పెద్ద ఎత్తున్న కేకలు వేయడంతో స్థానికులు గుర్తించారు. ఆపై దాన్ని చాకచక్యంగా పట్టి చంపేశారు.